ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 18 అక్టోబరు 2025



కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ముందంజ

బెలగాం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమోటోగా స్వీకరించిన అర్జీల మేరకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జిల్లా అగ్రగామిగా నిలిచింది. వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో విచారణ చేసి ఇప్పటివరకు 1,99,593 వరకు వివిధ కులధ్రువీకరణ పత్రాలు అందించారు.ఈ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించిన పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు.




సీతంపేట ఐటీడీఏ నుంచి శ్రీకాకుళం తరలిపోనున్న డీడీ కార్యాలయం

నేడో.. రేపో!

● తరలిపోనున్న డీడీ కార్యాలయం ● సిబ్బంది వివరాల సేకరణ

సీతంపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నేడే.. రేపో శ్రీకాకుళం తరలిపోనుంది. ఈ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా సీతంపేటలో ఉన్న డీడీ కార్యాలయం జిల్లాల విభజన తరువాత శ్రీకాకుళం జిల్లా పరిధిలోకి వెళ్లింది. ఈ కార్యాలయాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి తరలించేందుకు అప్పట్లోనే అక్కడి కలెక్టర్ నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. వాస్తవంగా శ్రీకాకుళంలో డీడీ కార్యాలయం నిర్వహించేందుకు సరిపడా భవన సదుపాయం లేదు. దీంతో కొన్నాళ్ల పాటు తరలింపు ప్రక్రియ ఆగింది. అంతేకాకుండా డీడీ కార్యాలయం సీతంపేటలోనే ఉంచాలని గిరిజనసంఘ నాయకులు అప్పట్లో పట్టుబట్టడంతో కార్యాలయం తరలింపు సాధ్యపడలేదు. అయితే శ్రీకాకుళంలో నూతన భవన సముదాయాలు అందుబాటులోకి వచ్చాయి. బీసీ, ఎస్సీ, గిరిజనసంక్షేమశాఖలన్నీ ఒకే భవన సముదాయాల్లో ఉండాలని అక్కడి కలెక్టర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో సీతంపేట ఐటీడీఏలో ఉన్న డీడీ కార్యాలయం శ్రీకాకుళం తరలించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. దీనిపై డీడీ అన్నాదొరను వివరణ కోరగా.. సీతంపేట ఐటీడీఏలో నిర్వహిస్తున్న డీడీ కార్యాలయం సిబ్బంది వివరాలను అడిగారని, ఈ మేరకు శీకాకుళం జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించినట్లు తెలిపారు.



ఈ క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

● ఊపందుకోని ఈ-క్రాప్
● వేధిస్తున్న సాంకేతిక సమస్యలు
● జిల్లాలో 3.20 లక్షల ఎకరాల లక్ష్యం
● ఇప్పటివరకు నమోదైంది 2.80 లక్షల ఎకరాలు
● సమీపిస్తున్న గడువు
● ఆందోళనలో రైతులు

నత్తనడకన!

పాలకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ క్రాప్ నమోదు నత్తనడకన సాగుతోంది. జూలై నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తికాకపోవడంపై రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2.80 లక్షల ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వాస్తవానికి మన్యంలో 3.20 లక్షల ఎకరాల్లో ఈ ప్రక్రియ జరగాల్సి ఉంది. కాగా క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరిగా వెబ్‌ల్యాండ్‌లో చూసి నమోదు చేయడం కుదరడం లేదు. మరోవైపు వ్యవసాయ సహాయకులు పంట భూములను పరిశీలించి ఈ క్రాప్ నమోదు చేయాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ మరింత జాప్యమవుతుంది. కాగా ఈ నెలాఖరకు ఈ క్రాప్ నమోదు కార్యక్రమం పూర్తి కావాలని వ్యవసాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో వ్యవసాయ సహాయకులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. సాంకేతికపరమైన సమస్యలు ఎదురవుతున్నా వాటిని అధిగమించి క్షేత్రస్థాయిలోకి వెళ్లి వ్యవసాయ, ఉద్యాన పంటల నమోదుకు చర్యలు చేపడుతున్నారు. ఏదేమైనా వెబ్‌ల్యాండ్, సాంకేతిక సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తేనే ఈ క్రాప్ నమోదు వేగవంతమయ్యే అవకాశం ఉంది. లేకుంటే ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తవడం కష్టమేనన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్‌ను వివరణ కోరగా..' జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ఈ నెలాఖరులోగా పూర్తి కావాలి. ఈ మేరకు వ్యవసాయ సహాయకులకు ఆదేశాలు జారీ చేశాం. వారి పరిధిలో ఉన్న పంట భూములకు సంబంధించి ఈ క్రాప్ నమోదు త్వరగా పూర్తి చేయాలని సూచించాం.' అని తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్ప వరం 10లో
● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

సిరి సంపదల కోసం..
● లక్ష్మీదేవి, కుబేరుడికి ప్రత్యేక పూజలు
● ఆరోగ్యం కోసం ధన్వంతరికి.. ● నేడు ధన త్రయోదశి
● మార్వాడీలకు ఎంతో ప్రత్యేకం 8లో

పంట కాలువను పట్టించుకోరా? 9లో
● సాగునీటి ప్రవాహానికి అడ్డంకి

ఖైదీలపై వివక్ష చూపించొద్దు 8లో
● న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్

మెరుగైన వైద్యం అందించాలి

● వైద్యులకు మంత్రి సంధ్యారాణి ఆదేశం ● సాలూరు ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులకు పరామర్శ

సాలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. సాలూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలు హాస్టళ్ల విద్యార్థులను శుక్రవారం పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పీహెచ్‌సీ వైద్యుల సమ్మె వల్ల ఆరు హాస్టళ్ల నుంచి సాలూరు ఆసుపత్రికి విద్యార్థులు వచ్చారన్నారు. వారిలో ఒక సోషల్ వెల్ఫేర్, నాలుగు గిరిజన హాస్టళ్లు, కేజీబీవీకి చెందిన 21 మంది ఉన్నారని వెల్లడించారు. వారెవరికీ తీవ్ర అనారోగ్య సమస్యలు లేవని తెలిపారు. విద్యార్థుల్లో ఒకరు జాండీస్, మరొకరు మలేరియా లక్షణాలతో బాధపడుతున్నారని, మిగతా వారు రక్తహీనత, గాయాలు, వైరల్ ఫీవర్లకు చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారు పూర్తిగా కోలుకునేంతవరకు వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని, చిన్నారులు డిశ్చార్జి అయ్యేంతవరకు జాగ్రత్తగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. హాస్టళ్లలో ఆహారం నాణ్యత, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత , వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే అంశాలపై పూర్తిస్థాయి సమీక్ష చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మీనాక్షి, టీడీపీ నాయకులు ఉన్నారు.



ఆసుపత్రిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గురుకులం విద్యార్థినులకు బొత్స పరామర్శ

● బాధిత కుటుంబాలకు పార్టీ తరపున సాయం అందజేత

పార్వతీపురం/బెలగాం/కురుపాం రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పచ్చకామెర్లతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన కురుపాం గురుకులానికి చెందిన ఇద్దరు బాలికల కుటుంబాలను ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పరామర్శించారు. శుక్రవారం కురుపాం మండలం దండుసూర గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో బాధిత కుటుం బాలకు ఆయన ఆర్థిక సాయం అందించారు. మృతి చెందిన బాలికలు కల్పన, అంజలి తల్లులు జయమ్మ, భవానికి వైసీపీ తరపున రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒక్కో బాలిక కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కురుపాం గురుకులంలో చదువుతున్న బాలికలకు పూర్తిగా వైద్య పరీక్షలు జరిపి ఆ రిపోర్టులను వారి తల్లిదండ్రులకు అందజేయాలన్నారు. కురుపాం గురుకులంలోని 600 మంది బాలికల్లో 200 మందికి జాండీస్ లక్షణాలు ఉండడం దారుణమన్నారు. ఈ సంఘటనపై జాతీయ మానవ హక్కుల, ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ బొత్స పార్వతీపురం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ జాండీస్‌తో చికిత్స పొందుతున్న కురుపాం గురుకులం, ఏకలవ్య పాఠశాలల విద్యార్థినులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించి, అందరికీ మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, రాజన్నదొర, కళావతి, జోగారావు ఉన్నారు.



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం బాలికను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స

14 మందికి సాధారణ జ్వరాలు

● డీఎంహెచ్‌వో భాస్కరరావు



సాలూరు ఏరియా ఆసుపత్రిలో పిల్లలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పార్వతీపురం/సాలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల్లో 14 మంది సాధారణ జ్వరాలతో బాధపడుతున్నారని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. శుక్రవారం సాలూరు ఆసుపత్రికి వెళ్లి పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివిధ ఆశ్రమ పాఠశాలలకు చెందిన మొత్తం 18 మంది విద్యార్థులు స్వల్ప అనారోగ్య సమస్యలతో సాలూరు ఏరియా ఆసుపత్రిలో చేరినట్లు వెల్లడించారు. 21 మంది పచ్చకామెర్లతో బాధపడుతున్న జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఇద్దరికి జాండీస్ లక్షణాలు ఉండగా.. వారిలో ఒకరి పరిస్థితి మెరుగవడంతో డిశ్చార్జి చేశామని తెలిపారు. మిగతా పిల్లలందరూ బాగానే ఉన్నారని చెప్పారు. ఇదిలా ఉండగా మంత్రి సంధ్యారాణి పిల్లల ఆరోగ్య పరిస్థితిపై డీఎంహెచ్‌వో, ఇతర వైద్యాధికారులతో సమీక్షించారు.

మరో 12 మంది ఇళ్లకు ..

బెలగాం: పచ్చకామెర్లతో పార్వతీపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం గురుకులం, ఏకలవ్య పాఠశాల విద్యార్థినులు కోలుకుంటున్నారు. శుక్రవారం మరో 12 మంది డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో 24 మంది బాలికలు చికిత్స పొందుతున్నారు. కేజీహెచ్‌లోమరో ముగ్గురు వైద్య సేవలు పొందుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి జిల్లాలో నకిలీ మద్యం లేదు

● ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసచౌదరి



విజయనగరం క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎక్కడా నకిలీ మద్యం ఆనవాళ్లు కనిపించలేదని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాణ్య మైన మద్యం అందించేందుకు ప్రభుత్వం సురక్ష మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. మద్యం బాటిల్ కొనుగోలు చేసేటప్పుడు యాప్ ద్వారా నాణ్యతను తెలుసుకోవచ్చునని అన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 225 మద్యం షాపులు, 26 బార్లలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఎక్కడా నకిలీ మద్యం దాఖలాలు కనిపించ లేదన్నారు. నాణ్యమైన మద్యం విక్రయించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో విస్తృ తంగా తనిఖీలు చేపడతున్నామన్నారు. నకిలీ మద్యానికి జిల్లాలో తావులేదని అన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత టీచర్లదే..

● జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

పార్వతీపురం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వసతిగృహ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత టీచర్లదేనని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వార్డెన్లు, హెచ్ఎంలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. అనారోగ్య కారణాలతో వసతిగృహ విద్యార్థులు బయటకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఆరోగ్యవంతులుగా హాస్టల్‌కు వచ్చే వరకు సంబంధిత ఉపాధ్యాయులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. పిల్లల ఆరోగ్య వివరాలను ముందుగా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య రికార్డులను నిర్వహించాలన్నారు. వారికి పౌష్టికాహారం అందించాలని, వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయశాంతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, సహాయ గిరిజన సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పార్వతీపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని జేసీ ఆదేశించారు. డోకిశీలలోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

స్వచ్ఛందంగా జలపాతం అభివృద్ధి

● ముందుకొచ్చిన గిరిజనులు

సాలూరు రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి దళాయివలస వాటర్‌ఫాల్స్ అభివృద్ధి పనులను చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. ఇందులో భాగంగా దళాయివలస గ్రామస్థులు, మహిళలు, యువత చురుగ్గా ముందుకొచ్చారని వెల్లడించారు. దళాయివలస నుంచి వాటర్ ఫాల్స్ వరకు 5 కిలోమీటర్ల రహదారి వేశారన్నారు. వాటర్ ఫాల్స్ దగ్గర పర్యాటకులకు ఇబ్బంది లేకుండా వెదురు కర్రలతో వంతెన నిర్మాణం చేపట్టారని, వాష్‌రూమ్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామం నుంచి వాటర్ ఫాల్స్ వరకు పర్యాటకులను బైక్‌లపై తీసుకెళ్లడానికి యువత ముందుకొచ్చినట్లు వెల్లడించారు. కాగా గ్రామస్థుల సహకారంతో దళాయివలస వాటర్‌ఫాల్స్‌ను ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆమె వెంట వెలుగు ఏపీఎం జయమ్మ, సర్పంచ్ తదితరులు ఉన్నారు.



వాటర్‌ఫాల్స్ వద్ద పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

ఘనంగా పైడిమాంబ అంబలం పూజ 8లో



తోటపల్లి ఈవో బాధ్యతల స్వీకరణ

గరుగుబిల్లి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఉత్త రాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల ఈవోగా బండ్లముడి శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. అందరి సహకారంతో తోటపల్లిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాగా శంబర పోలమాంబ ఆలయ ఈవోగా పనిచేసిన ఆయనకు తోటపల్లి దేవస్థానం అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ ఈవోగా ఉన్న వీవీ సూర్యనారాయణ ఇకపై పాల కొండలోని కోట దుర్గమ్మ ఆలయ బాధ్యతలు చూసుకోనున్నారు.



ఈవో శ్రీనివాస్

రుణాల వసూలుపై దృష్టి పెట్టండి

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి



కలెక్టర్ రామసుందర్ రెడ్డికి సమస్యను వివరిస్తున్న ఉద్యోగి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయడంతో పాటు గతంలో ఇచ్చిన రుణాల వసూలుపై కూడా దృష్టి పెట్టాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. రికవరీ సక్రమంగా ఉన్నపుడే బ్యాంకులపై కొత్త రుణాల కోసం ఒత్తిడి తీసుకుని రాగలమని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద రుణాలను అందజే యడానికి బ్యాంకులు ఆశక్తి చూపాలని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న బ్యాంకర్ల సమావేశానికి బ్రాంచ్ మేనేజర్లు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు జిల్లా స్థాయి సమావేశంలో సమాధానాలు దొరుకుతాయని చెప్పారు. నాబార్డు ద్వారా అమలవుతున్న అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ పథకం ద్వారా యువత అగ్రి ప్రెన్యూ ర్లుగా మారే అవకాశాలు కలుగుతాయని తెలిపారు. నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ పథకం కింద అభ్యర్థులకు 45 రోజులు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తామని తెలిపారు. ఎల్‌డీఎం మూర్తి, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు. మెప్మా ద్వారా ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు..

కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో 27 వినతులు అందాయి. గత నెలలో అందిన 40 ఫిర్యాదులలో అత్యధిక శాతం సమస్యలు పరిష్కారం కావడంతో ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రెజరీ, డ్వామా, ఈపీడీసీఎల్, మెడికల్ విభాగాలకు చెందిన ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఎస్టాబ్లి ష్మెంట్ సమస్యలు వస్తున్నందున ఆయా విభా గాల అధిపతులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అవవసరమైతే ఆయా శాఖల ప్రధాన అధికారులకు డీవో లెటర్ రాస్తామని కలెక్టరు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా... ఎస్.కోట మండలానికి చెందిన దివ్యాంగ ఉద్యోగి తనవరపు రూపశ్రీ ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యారు. ఆమెను కురుపాం మండలానికి కేటాయించారు. పూర్తిగా దివ్యాంగురాలు కావడంతో ఉద్యోగుల గ్రీవెన్స్‌లో ఈ సమస్యను చెప్పుకోవడానికి తన తండ్రి సాయంతో కలెక్టరేట్‌కు వచ్చారు. మూడు చక్రాల వాహనంలో కలెక్టరేట్ లోపల కూర్చున్న ఆమెను కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆప్యాయంగా పలుకరించారు. ఆమె సమస్యపై మానవత్వంతో స్పందించిన కలెక్టర్... ఈ సమస్యను ప్రభుత్వానికి పంపించి మేలు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

ఖైదీలపై వివక్ష చూపించొద్దు

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్

విజయనగరం క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖైదీల పట్ల సిబ్బంది కానీ.. సహచరులు కానీ వివక్ష చూపించరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని సబ్ జైలు, వన్‌స్టాప్ సెంటర్, జువెనైల్ బోర్డుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వారి పట్ల వివక్ష చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఖైదీలకు సూచించారు. ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని... మంచి పౌరులుగా సమాజంలో మెలగాలని సూచించారు. జైలులో ఉన్న నిందితులకు న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమన్నారు. రిమాండ్‌లో ఉన్న వారి తరఫున ఎవరూ లేకుంటే.. జిల్లా న్యాయసేవా సంస్థ న్యాయవాదిని ఉచితంగా నియమిస్తుందని తెలిపారు.



భోజనాలను పరిశీలిస్తున్న కృష్ణప్రసాద్



ఘనంగా పైడిమాంబ అంబలం పూజ

విజయనగరం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సిరులతల్లి పైడిమాంబ దీక్షాధారుల ఆదిపీఠం ఆధ్వర్యంలో కోట జంక్షన్‌లో శుక్రవారం అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. పైడిమాంబ దీక్షాధారులు వివిధ భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శిరీష, పూజారి బంటుపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

సిరి సంపదల కోసం..

● లక్ష్మీదేవి, కుబేరుడికి ప్రత్యేక పూజలు
● ఆరోగ్యం కోసం ధన్వంతరికి..
● నేడు ధన త్రయోదశి
● మార్వాడీలకు ఎంతో ప్రత్యేకం



విజయనగరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి)

ధన త్రయోదశి.. దీపావళికి రెండు రోజుల ముందు వచ్చే పండుగ. దీనిని మరాఠీలో.. ధన్ తేరాస్ అంటారు. మార్వాడీలు ఈ పండుగను సందడిగా చేసుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం తదితర పట్టణాల్లో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన మర్వాడీలు వివిధ వ్యాపారాలు చేస్తూ నివశిస్తున్నారు. వీరు ధన త్రయోదశిని ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆ రోజున కొత్త బంగారు వస్తువులు కొనుగోలు చేస్తారు. ఇటీవల కాలంలో ఇతర వర్గాలూ ఈ పండుగను నిర్వహిస్తున్నాయి. ఆ రోజున కొందరు బంగారు ఆభరణాలను... మరి కొందరు నూతన వాహనాలను కొనుగోలు చేస్తుంటారు.



అకాల మరణం సంభవించకుండా..

శాస్త్ర ప్రకారం ధన త్రయోదశి పండుగను అకాల మరణ భయాన్ని పోగొట్టడానికి యమధర్మరాజును ప్రార్థించే రోజుగా చెబుతారు. ఈ సందర్భంగా సంపదలకు అధిదేవత అయిన లక్ష్మీదేవిని, కుబేరుడిని పూజిస్తారు. అంతేకాకుండా వైద్య సేవలకు మూలపురుషుడైన ధన్వంతరి జయంతిని కూడా నిర్వహిస్తారు. దీపావళిని మార్వాడీలు ఐదు రోజుల పండుగగా నిర్వహిస్తారు.

మొదటి రోజు.. వసూబారాస్

వసూ బారాస్ పేరుతో మార్వడీలు ఆవు, దూడలకు తొలిరోజు పూజిస్తారు. ద్వాదశి రోజున తెల్లవారి లేచి.. సుంగంధ నూనెలను శరీరానికి పూస్తారు. ఆ తరువాత తలంటు స్నానాలు చేస్తారు. ఆరోజు మధ్యాహ్నం వరకు ఉపవాసం ఉంటారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఆవు, దూడలకు పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేస్తారు. ఇంట్లో చేసిన నైవేద్యాన్ని వాటికి ఆహారంగా పెడతారు. ఆ తరువాత ఉపవాసాన్ని విరమిస్తారు.

రెండో రోజు...

ధన్ తేరాస్.. తెలుగులో ధన త్రయోదశి. ఆ రోజు ఇళ్లను ఆవు మూత్రం కలిపిన నీటితో శుభ్రం చేస్తారు. సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో లక్ష్మీదేవి, కుబేరుడు, ధన్వంతరిలకు పూజలు చేస్తారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరిస్తారు. ఇంటికి దక్షిణ భాగంలో నెయ్యి లేదా నువ్వుల నూనె దీపం వెలిగిస్తారు. ఇది యమధర్మరాజును సంతోష పెట్టేందుకని వారి నమ్మకం. ఆ రోజు ప్రదోష కాలంలో గణేశుడు, లక్ష్మీదేవి, కుబేరులను పూజిస్తారు. 13 దీపాలను వెలిగించి.. కుబేరునికి మంత్రాలతో ధ్యానిస్తారు.

మూడో రోజు దీపావళి..

మూడో రోజు సూర్యాస్తమయం తరువాత ప్రదోష కాలంలో ఇంట్లో గణేశుడు, లక్ష్మీదేవిల ప్రతిమలు ఏర్పాటు చేసి.. ప్రత్యేకంగా మామిడి తోరణాలతో అలంకరిస్తారు. లక్ష్మీదేవిని బంగారు ఆభరణాలు, వెండి రూపాయలతో అలంకరించి.. వివిధ రకాల పిండి వంటలు నేవేద్యంగా సమర్పించి..పూజలు చేస్తారు. ఆ తరువాత దీపాలు వెలిగించి.. బాణసంచాతో సందడిగా పండుగ చేసుకుంటారు.

నాలుగో రోజు పడ్వా దీపావళి..

నాలుగో రోజున కుటుంబ యజమాని భార్య తన భర్తకు పూజా మందిరంలో హారతి ఇస్తుంది. దీనికి ప్రతిగా భర్త తన భార్యకు బహుమతి ఇస్తాడు. ఇల్లాలు చేసే ఈ పూజలతో మహా విష్ణువు అనుగ్రహం లభిస్తుందని.. భార్యాభర్తల మధ్య అనురాగం పెరుగుతుందని నమ్మకం.

ఐదో రోజు..

కార్తీకమాసంలో భగినీహస్త భోజనం రోజున మార్వాడీలు బహుబజీ పేరుతో పండుగ జరుపుకుంటారు. సోదరుడికి సోదరి రక్ష కట్టి హారతి ఇస్తుంది. సోదరి ఇంట్లో భోజనం చేసి..ఆమెకు కానుక ఇస్తాడు. సోదరీ సోదరుల బంధం మరింత బలపడేందుకు ఈ పండుగ నిర్వహిస్తారు. ఈ ఐదు రోజులూ సూర్యాస్తమయ సమయంలో ఇంటి బయట దీపాలు వెలిగిస్తారు. కొందరు సంపన్నులు ఈ పండుగను పదిహేను రోజుల వరకు నిర్వహిస్తారు.

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ అతిథి అధ్యాపక పోస్టుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలతో కూడిన దరఖాస్తును కళాశాలలో ఈనెల 22న బుధవారం సాయింత్రం 5గంటల లోపు అందజేయాలన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ వంటి అదనపు విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సంతకవిటి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండవకురిటి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో కుస్తీ పోటీలకు ఎం.సోనియ, అండర్-17 విభాగంలో కుస్తీ పోటీలకు పోతురాజు మేఘన, ఈత పోటీలకు ఎ.సాయిభార్గవి, సి.నాని, బి.ధనలక్ష్మీలు ఎంపికయ్యారని హెచ్‌ఎం రమణమ్మ శుక్రవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ఆయన చెప్పారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

ముడి సరుకు కొరత పేరిట కుదింపు తగదు

నెల్లిమర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జ్యూట్ యాజమాన్యం ముడిసరుకు (నార) కొరత పేరిట కార్మికుల కుదింపు తగదని జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లింపల్లి రామరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక జ్యూట్‌మిల్లు గేటు వద్ద కార్మికులను ఉద్దేశించి గేటు మీటింగ్‌లో మాట్లాడారు. జ్యూట్ యాజమాన్యం నార కొరత పేరిట కార్మికులు, మిషన్లను కుదించడం దారుణమన్నారు. రిటైర్డ్ కార్మికులకు ఇంతవరకు గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించలేదన్నారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి యత్నానికి నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాని ఖండిస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ రాజాం నియోజకవర్గ నాయకు లు నిరసన చేపట్టారు. అనంతరం తహసీ ల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజక వర్గ ఎంఈఎఫ్ అధ్యక్షుడు అరసాడ ఆనంద రావు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు యంద వ నారాయణరావు, రవికుమార్, పౌలు తదిత రులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

కొత్తవలస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కొత్తవలస తాలూకా యూనిట్ ఎన్జీవో సంఘం ప్రతినిధులు జేవీ ప్రసాదరావు, కె.వెంకటరావు, కిషోర్, గోపి కోరారు. శుక్రవారం కొత్తవలసలో కంటకాపల్లి, కాటకాపల్లి, బలిఘట్టాం, కొత్తవలస సచావాలయ ఉద్యోగులతో వారు సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్, ప్రమోషన్ చానల్ ప్రకటించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలులోకి తీసుకు రావాలన్నారు.

వీసీలో పాల్గొన్న బంగార్రాజు

భోగాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇఫ్కో బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌తో శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇఫ్కో బోర్డు ఆఫ్ డైరెక్టర్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. ఇఫ్కో బోర్డుకు సంబంధించి పలు విషయాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ

రేగిడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఖండ్యాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ శుక్రవారం సీపీఆర్ (హృదయ శ్వాసకోస పునర్జీవనం)పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గులివింద నాగభూషణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిగిలిన డబ్బులు ఇవ్వండి

గజపతినగరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహా పోషణ్ కార్యక్రమానికి గాను వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో మహాపోషణ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సెక్టార్ల లీడర్లు.. అంగన్‌వాడీ కార్యకర్తల అంగీకారం మేరకు ప్రతి కేంద్రం నుంచి రూ.500 వసూలు చేసినట్టు తెలిసింది. మొత్తం 213 మంది రూ.500 చొప్పున రూ.లక్షా 6,500 అందజేసినట్టు సమాచారం. అయితే గురువారం నిర్వహించే కార్యక్రమానికి మంత్రి ఇతర దేశాల్లో ఉండడంతో హాజరుకాలేదు. అలాగే పీడీ కూడా రాలేదు. దీంతో కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. దీంతో మిగిలిన డబ్బులు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు.. సెక్టార్ లీడర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీనిపై ఐసీడీఎస్ పీవో రాజేశ్వరి మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు.

పంట కాలువను పట్టించుకోరా?

- తుప్పలతో నిండిన వైనం
- సాగునీటి ప్రవాహానికి అడ్డంకి
- ఇబ్బందులు పడుతున్న రైతులు

భోగాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ సుందరపేట గ్రామానికి వెళ్లే పంట కాలువను అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువ తుప్పలతో నిండుకుని సాగునీరు ప్రవహించడానికి వీలు లేకుండా ఉంది. శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లే సర్వీస్ రహదారిని ఆనుకుని పాలబంద పంట కాలువ ఉంది. ఈ పంట కాలువ నుంచి పాలబంద, ఎండిబంద, రవ్వోల బంద, పడాల బంద చెరువులకు నీరు వెళ్తుంది. ఈ నాలుగు చెరువుల కింద సుమారు 400 ఎకరాల పంట పొలం ఉంది. అయితే ఈ పంట కాలువ పూర్తిగా తుప్పలతో నిండిపోవడంతో ఆ



తుప్పలతో నిండిన పంట కాలువ

చెరువులకు సరిగ్గా నీరు వెళ్లడం లేదు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి నీరు సక్రమంగా ప్రవహించే విధంగా పంటకాలువలో తుప్పలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

రూ.4.10లక్షలు మంజూరయ్యాయి

పాలబంద కాలువ అభివృద్ధికి ఆపరేషన్ అండ్ మెంటెనెన్స్‌లో రూ.4.10లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేసేలోపే కాలువలోకి నీరు వచ్చి చేరింది. దీంతో పనులు ప్రారంభం కాలేదు. నీరు తగ్గిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

- ఎం.రమేష్ చంద్ర, ఏఈఈ, నీటి పారుదల శాఖ

క్రీడలతో మానసిక ఉల్లాసం

- జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు

లక్కవరపుకోట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఎల్.కోట ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఏడు పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14, 17 ద్వారా ప్రతిభ కనబరిచినవారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, బీజేపీ నాయకులు సూర్యారావు, ఎంఈవో జి.శ్రీనివాసరావు, పీఈటీలు సూరి దేముడమ్మ, గాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ● బొండపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ చల్లా చలంనాయుడు శుక్రవారం ప్రారంభించారు. 10 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అయితే దేవుపల్లి కేజీబీవీ, రాచకిండాం ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉప ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ బండారు బాలాజీ, మండల క్రీడా విభాగం ఇన్‌చార్జి పీడీ గెడ్డ గురునాయుడు, అదనపు ఎంఈవో కేవీ రమణ, ఈవోపీఆర్డీ రఘుపతిరావు, హెచ్‌ఎం ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు. ● వేపాడ: వల్లంపూడి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌ను ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతల వెంకటరమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు. ● గుర్ల: గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ పొట్నూరు ప్రమీల శుక్రవారం ప్రారంభించారు. జడ్పీటీసీ అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ వి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● దత్తిరాజేరు:



ఎల్.కోట: పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

మరడాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలకు శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో 334 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు ఎంఈవో సుధాకర్ తెలిపారు. అండర్-19 విభాగం ఉమ్మడి విజయనగరం జిల్లా జనరల్ సెక్రటరీ సీహెచ్.రాజేష్‌ను సర్పంచ్ పోతల రామలక్ష్మి, నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం మహేష్, పీఈటీలు పాల్గొన్నారు. ● భోగాపురం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పైన మక్కువ పెంచుకోవాలని ఎంఈవోలు రమణమూర్తి, చంద్రమౌళిలు సూచించారు. శుక్రవారం భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

శృంగవరపుకోట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌష్టికాహార పక్షోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె పాల్గొని, మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు జుత్తాడ రామసత్యం, కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, చెక్కా కిరణ్, పెదగాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం కిల్తంపాలెం పంచాయతీ సచివాలయంలో ఎంపీపీ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కోరారు. అయితే కొందరు సిబ్బంది పంచాయతీ వివరాలు చెప్పకపోవడం విస్మయం కలిగించింది.

కొండవెలగాడలో రక్తదాన శిబిరం

నెల్లిమర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, దివంగత నేత దంతులూరు శంకరసీతారామరాజు(సింగుబాబు) జయంతి సందర్భంగా ఆయన కుమారుడు దంతులూరు అజయ్‌బాబు ఆధ్వర్యంలో కొండవెలగాడలో శుక్రవారం రక్తదన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని, సింగుబాబు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, కంది చంద్రశేఖరరావు, పతివాడ అప్పలనాయుడు, జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, జనాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో చీడపీడల నివారణపై అవగాహన

వేపాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వరిలో వచ్చే చీడపీడల నివారణపై రైతులు అవగాహన కలిగిఉండాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి అన్నారు. సోంపురం గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాస్పరస్ సొల్యూబులైజింగ్ బాక్టీరియా, పోటాషియం రిలీజింగ్ బాక్టీరియా వాడకం మీద రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు వీటిని పూర్తి రాయితీపై అందజేశారు. అదేవిధంగా పొలంబడి బ్యాగులు పంపిణీ చేశారు. బ్యాగులో ఉన్న ఐపీఎం కిట్స్ ఉపయోగాలను వివరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పందెంరాయుళ్లపై దాడి

కొత్తవలస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం చిన్నిపాలెం సమీపంలో కోడిపందాలు ఆడుతున్న ఐదుగురిని విజయనగరంనకు చెందిన ఎస్‌బీ పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి, ఐదుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకు, వీరి నుంచి రూ.లక్షా 23వేల280, ఐదు సెల్‌ఫోన్లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కొత్తవలస పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొని, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని, విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లు మంజూరు చేయాలని, అదే విధంగా సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని, ఇళ్లు, ఇళ్ల పట్టాలు, ఇంటి రుణాలు ఇవ్వాలని కోరుతూ వినతులు వచ్చాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

అభివృద్ధి దిశలో రాష్ట్రం

- ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మునిసిపాల్టీ పరిధిలోని వస్త్రపురి కాలనీలో సెంటెన్స్ పాఠశాల వెనుక భాగంలో ఏర్పాటుచేసిన జీఎంఆర్ వరలక్ష్మీ కళాక్షేత్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాం ప్రధాన రహదారి పనులు 90శాతం పూర్తి చేశామని చెప్పారు. విజయనగరం నుంచి రాజాం మీదగా పాలకొండ వెళ్లే ప్రధాన రహదారి నాలుగు లైన్ల పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు కళాక్షేత్రం ప్రారంభించేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్



కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, టీడీపీ నాయకులు గురవాన నారాయణరావు, పిస్నింటి మోహన్‌రావు, శాసపు రమేష్‌కుమార్, మహేష్, నాగళ్ల అప్పలనాయుడు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, ముగడ శ్రీను, యడ్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చల పేరుతో కాలయాపన తగదు

రాజాం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకుడు రామ్మూర్తి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాంలో శుక్రవారం నిర్వహించిన ఆశ వర్కర్ల మండల కమిటీ సమావేశం లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీలలో 2,800 మంది వైద్యులు పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అనేక ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. వారి సమస్యలను పరిష్కరించకుండా చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.

ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతం పెంచాలి

శృంగవరపుకోట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతం పెంచాలని బహుజన మేధావులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్.కోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా దళిత ఉద్యమ నేతలు, మేధావులు ఎస్.ఆర్ వేమన, ఆతవ ఉదయ్‌భాస్కర్, అదాడ మోహనరావు, కెల్ల భీమరావు, గొల్ల ఈశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను, అట్రాసిటీ చట్టంలో 41వ సెక్షన్‌ను రద్దు చేయాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను



ధర్నా చేస్తున్న దళిత ఉద్యమ నాయకులు

భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

గుర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా అందించలేకపోయారని అన్నారు. దీనిపై ఇన్‌చార్జి ఏవో నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ఈ మండలానికి యూరియా సరఫరా చేశామని, కానీ కొంతమంది వాటిని పట్టుకెళ్లారని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదని కొండగండ్రేడు సర్పంచ్ గోవింద్ అధికారులను నిలదీశారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎంఈవో భానుప్రకాష్ తెలిపారు. విద్యుత్ వైర్లు, స్తంభాల పరిస్థితిపై కొండగండ్రేడు, పకీరుకిత్తాలి, వల్లాపురం, గరికివలస, పాలవలస, కోటగండ్రేడు తదితర గ్రామాల సర్పంచ్‌లు ఏఈ నారాయణనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని పరిశీలిస్తామని ఏఈ సమాధానం ఇచ్చారు. ఇలా వివిధ సమస్యలపై సర్పంచ్‌లు ప్రస్తావించారు. వైస్ ఎంపీపీ తిరుపతిరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితులకు న్యాయం చేయండి

ఎస్.కోట రూరల్ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఎస్ఈజెడ్ పరిశ్రమ కోసం భూములు తీసుకుని 20 ఏళ్లు అయినా పరిశ్రమ రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అక్కడ రైతులకు తిరిగి వారి భూములను వెనక్కి ఇప్పించిందని.. ఇదే విధానాన్ని మండలంలోని జిందాల్ నిర్వాసితులకు వర్తింపచేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. బొడ్డవర గ్రామంలో 119వ రోజు శుక్రవారం జిందాల్ నిర్వాసితులు దీక్షను కొనసాగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత రైతులను విస్మరించడం బాధాకరం అన్నారు.



జిందాల్ నిర్వాసితులతో రైతు సంఘ నేత చల్లా జగన్

ప్రతినిధులను తీసుకురండి

గతంలో జిందాల్ కంపెనీకి భూములు ఇచ్చి మోసపోయాం.. అనేకసార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేశాం.. వీటిని పరిశీలించడానికి రెవెన్యూ అధికారులతో పాటు జిందాల్ ప్రతినిధులను తీసుకురావాలని ఫిర్యా దుదారులు కోరారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావే శంలో వీరు మాట్లాడారు. సమావేశాలు నిర్వహించడం చాలా బాగుంది.. ఇదే సమయంలో జిందాల్ ప్రతినిధులు హాజరైతే తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తామ ని తెలిపారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ జిందాల్ ప్రతినిధులకు సమాచారం ఇచ్చామని, వారు వస్తామని చెప్పారని వివరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మక్కువ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మక్కువలోని నాయుడు వీధికి చెందిన గొర్లి లక్ష్మణరావు(55) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువకు చెందిన లక్ష్మణరావు, సీతాలక్ష్మి వ్యవసాయం చేస్తుంటారు. వీరికి కుమారుడు అనంతకుమార్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు ఇదివరకే వారు వివాహం చేశారు. కుమారుడు అనంతకుమార్‌కు ఇదే మండలంలోని దబ్బగడ్డకు చెందిన వీరపిండి శ్రీరాములు, లక్ష్మీల కుమార్తె పద్మావతితో రెండేళ్ల కిందట వివాహం చేశారు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో పద్మావతి కన్నవారింటిలో ఉంటోంది. అక్కడ నుంచి అనంతకుమార్, అతడి కుటుంబసభ్యులపై పద్మావతి గృహ హింస, మెయింటినెన్స్ కేసులు పెట్టింది. ఈ కేసులతో మనస్తాపానికి గురైన లక్ష్మణరావు శుక్రవారం తన కల్లంలోని చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. అనంతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తవలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన బొబ్బర సోమునాయుడు(51) మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. మద్యానికి బానిస అవడంతో భార్య మందలిస్తుండేది. దీంతో మనస్తాపానికి గురైన సోమునాయుడు ఈనెల 15వ తేదీ ఉదయం 4 గంటల సమయంలో పురుగు మందు తాగాడు. వెంటనే ఎస్.కోట ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కోడలు జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి..

కొత్తవలస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చినరావుపల్లి పంచాయతీ రైల్వేగేట్ సమీపంలోనున్న తిరుపతిరాజు చెరువులో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందినట్టు గ్రామస్థులు కొత్తవలస సర్పంచ్ బూసాలదేముడుకు శుక్రవారం సమాచారం అందజేశారు. సర్పంచ్ అందించిన సమాచారం మేరకు ఎస్ఐ జోగారావు తన సిబ్బందితో వెళ్లి, చెరువులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు ఎవరు అనేది తెలియ రాలేదు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. వివరాలు తెలియ రావలసి ఉంది. ఎస్ఐ జోగారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒకటవ నగర పోలీస్‌స్టేషన్‌లో 2022లో నమోదైన గంజాయి కేసులో అస్సాం రాష్ట్రానికి చెందిన ఆకాష్ ఖుడా(22)కి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష జరిమానాని విధిస్తూ, విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.మీనాదేవి శుక్రవారం తీర్పు వెల్లడించినారు. నగరంలోని రైల్వేస్టేషన్ పరిధిలో సెప్టెంబరు 19, 2022లో ఒక లాడ్జిలో ముగ్గురు వ్యక్తులు మూడు బ్యాగులతో ఉండడాన్ని గమనించి, పోలీసులు వారిని విచారించారు. ఆ బ్యాగులో ఉన్న 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు. తాజాగా ఆ కేసులో తీర్పు వెలువడింది.

అక్రమంగా నిల్వ చేసిన విత్తనాలు, పురుగు మందులు సీజ్

పూసపాటిరేగ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగలో కొవ్వాడకు వెళ్లే మార్గంలో గల ఒక లేఅవుట్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మొక్కజొన్న విత్తనాలు, కలుపు నివారణ మందులను అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఒక కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలు, పురుగు మందులు ఇక్కడ అక్రమంగా నిల్వ చేసినట్టు మండల వ్యవసాయ అధికారిణి నీలిమ సమాచారం తెలుసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. పురుగు మందుల నిల్వలను, మొక్కజొన్న విత్తనాలను పరిశీలించారు. వాటికి ఎటువంటి బిల్లులు లేకపోవడాన్ని గుర్తించారు. జిల్లాలో ఏ డీలరు వద్ద నుంచి గానీ కొనుగోలు చేసినట్టు లేదు. దీంతో 2,615 కిలోల మొక్కజొన్న విత్తనాలు, 254 కిలోల కలుపు నివారణ మందులను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.9లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కంపెనీపై 6ఏ కేసును నమోదు చేస్తున్నట్టు చెప్పారు. స్థానిక వీఆర్వో, పోలీసులు, వ్యవశాయశాఖ అధికారులు వీటిని సీజ్ చేశారు. ఇదే పరిశ్రమ గతే ఏడాది కూడా ఇదే విధంగా అక్రమంగా విత్తనాలు, పురుగు మందులు నిల్వ చేసి, రైతులకు పంపిణీ చేసినట్టు ఉన్న సమాచారంతో వ్యవశాయ శాఖ దీనిపై దృష్టి సారించింది.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి

భోగాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా సామగ్రి విక్రయానికి అనుమతులు తప్పనిసరి అని సీఐ కె.దుర్గాప్రసాదురావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బాణసంచా సామగ్రిని పరిమితికి మించి నిల్వ చేయకూడదని, అగ్నిప్రమాద నియమావళిని పాటించాలని సూచించారు. అనధికార విక్రయాలపై చర్యలు తీసుకుంటారన్నారు. ఎక్కడైనా గృహాల్లో అనధికారంగా అమ్మకాలు జరిపినట్టు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ● మెరకముడిదాం: బాణసంచా విక్రయాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని బుదరాయవలస ఎస్ఐ జె.లోకేష్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ధర్మకర్తల మండలి బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని పురాతన దేవాలయం మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం ధర్మకర్తల మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆ ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జనసేన నాయకురాలు పాలవలస యశస్వి, బీజేపీ నేత పి.రాజేష్‌వర్మ తదితరులు హాజరయ్యారు. దేవస్థానం ఈవో ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయం పవిత్రతను మరింత కాపాడాలని సూచించారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన భాను మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అసలైన హక్కుదారులను గుర్తించండి

కొత్తవలస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చిన్నిపాలెం గ్రామ రెవెన్యూలో భూముల రీసర్వేకు సంబంధించి అసలైన హక్కుదారులను గుర్తించి వారి పేరున రికార్డులలో నమోదు చేయాలని ఆ గ్రామ రెవెన్యూ భూముల సంరక్షణ రైతు సంక్షేమ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పి.అప్పలరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చిన్నిపాలెం గ్రామ రెవెన్యూలో సుమారు 12వందల ఎకరాల భూములకు సంబంధించి సమస్య ఉందని, దీనిపై చాలా సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొచ్చి దేముడుబాబు, బాదిరెడ్డి వెంకటరమణ, తమడపు అప్పారావు, సిమ్మ కన్నారావు, కల్లెంపూడి సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

రాజాం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌తో పాటు సింగిల్ యూజ్ వస్తువుల వినియోగాన్ని తగ్గించేలా విద్యార్థులు ప్రచారం చేయాలని రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు సూచించారు. శుక్రవారం వికాస తరంగిణి రాజాం శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వికాస తరంగిణి సెంట్రల్ కమిటీ సభ్యుడు టీటీవీ రమణమూర్తి మాట్లాడుతూ గుడ్డసంచుల వినియోగం పెరగాలని సూచించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య పరిస్థితులపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రతినిధులు టీటీవీ రమణమూర్తి, వాకచర్ల పైడిరాజు, మహంతి సత్యనారాయణ పాల్గొన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.

నిందితుడిని శిక్షించాలి

పాలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గవాయ్‌పై దాడికి యత్నించిన నిందితుడిని శిక్షించాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు బోసు మన్మథరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఆర్‌పీఎస్ మండల నాయకులతో కలిసి తహసీల్దార్ రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో కళింగ ప్రేమభూషణ్, నులకజోడు ప్రదీప్ కుమార్, యందవ సుదర్శనరావు, రమేష్, సంజీవ్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

●వీరఘట్టం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడి యత్నంపై ఎంఆర్‌పీఎస్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అనంతరం తహసీల్దార్ సాయి కామేశ్వర రావుకు బోసు మన్మథరావు మాదిగ, కె.ప్రేమ భూషణరావు, కల్యాణ్ ప్రసాద్, రంజిత్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.

●భామిని: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడంపై ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ఎస్.శివన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు బోస్ మన్మథరావు, మండల నాయకులు ఎల్.రాజేశ్, చరణ్, రవి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ

పాలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భాసూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంపీపీ భాను సుధాకర్ సీలింగ్ ఫ్యాన్లను శుక్రవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీకి హెచ్ఎం జామి రమేశ్, వ్యాయాయ ఉపాధ్యాయుడు నెల్లి వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా సహకరించాలని వారు కోరారు.

సామూహిక విష్ణు సహస్ర పారాయణం

పార్వతీపురంటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోవెల వీధిలోగల కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం వికాస తరంగిణి, సంస్కార వికాస్ ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ, పంచాయుధ స్తోత్ర పారాయాలు నిర్వహించారు. హిందూ ధర్మరక్షణ ప్రచారకుడు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 69వ తిరునక్షత్రం సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు గిరి వల్లభాచార్యులు పాల్గొన్నారు.

వలంటీర్లకు 'ఉల్లాస్' శిక్షణ

సీతంపేట రూరల్, అక్టోబర్17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య డైరెక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మిశ్రో, ఏపీవో సాగర్, ఏపీఎం కమలకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్ప వరం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన గొప్ప వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులతో శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన థాంక్యూ సీఎం సార్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ డీఎస్సీ నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఈవో రాజ్‌కుమార్, ఎస్టీ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎంఈవోలు చంద్రశేఖర్, భీముడు, హరి మాస్టారు, శంకరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే..

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు చెక్



కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందడంతో పాటు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం నర్సిపురంలో నిర్వహించిన స్మార్ట్ కార్డు పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొట్టాపు గౌరి, వెంకటరమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పార్వతీపురం రూరల్/ సీతానగరం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర లబ్ధిదారులకు అందజేశారు. సీతానగరం మండలం లక్ష్మీపురానికి చెందిన వి.ఆదినారాయణ కుటుంబానికి రూ.25,166, అదే మండలంలోని కృష్ణరాయపురానికి చెందిన వాకాడ కౌశిక్ కుటుంబ సభ్యులకు రూ.40,114 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

వీరఘట్టం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. వీరఘట్టంలోని శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను శుక్రవారం సుడా చైర్మన్ కొరికాన రవికుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరఘట్టంలో పార్క్, బస్ కాంప్లెక్స్‌ను కూడా నిర్మిస్తామన్నారు. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ మాట్లాడుతూ సుడా పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు తయారు చేశామన్నారు. ఇదే గ్రామానికి చెందిన కోడి శ్రీరామ్మూర్తినాయుడు విగ్రహాన్ని కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్ భాస్కర్, వీరఘట్టం పట్టణ టీడీపీ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, చింతా ఉమ పాల్గొన్నారు.

ఏడాదిలోపే సీసీ రోడ్లు

భామిని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదిలోపే సీసీ రోడ్లు నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం భామినిలో ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ, ఎంపీడీవో ఎస్.వసంతకుమారి, కిరణ్, రవి, జగదీశ్, ఆనంద్, కేశు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సీతంపేట రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం సీతంపేటలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకన్య, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూదేవి, ఏఎంసీ డైరెక్టర్ సంధ్యారాణి, జీసీసీ బీఎం కృష్ణారావు, మండల అధ్యక్షులు సవరతోట ముఖలింగం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు శ్రీనిధి



షీల్డ్‌ను అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

కురుపాం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో కురుపాం ఏపీ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని నెల్లి శ్రీనిధి ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఓ ప్రకనటలో తెలిపారు. ద్వితీయ స్థానం సాధించిన శ్రీనిధి శనివారం విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయిలో సెమినార్‌కు హాజరుకానుందని పేర్కొన్నారు. శ్రీనిధికి జిల్లా విద్యాశాఖ అధికారులు షీల్డ్‌ను ప్రదానం చేశారని తెలిపారు.

1429 లీటర్ల సారా ధ్వంసం

పాలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు నెలల వ్యవధిలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 1429 లీటర్ల సారా, 230 మద్యం సీసాలను శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. ఎస్ఐ సూర్యకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కొత్తమ్మతల్లికి వెండి కిరీటం



సాలూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెంటాడ వీధికి సమీపంలో నిర్మించిన కొత్తమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి పట్టణానికి చెందిన శంకరరావు, లక్ష్మి దంపతులు వెండి కిరీటాన్ని సమకూర్చారు. ఇందుకుగానూ రూ.2.50 లక్షలు వెచ్చించారు. పెద్దల సమక్షంలో ఆలయానికి కిరీటాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయి నారాయణసేవకు విరాళం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న దృశ్యం

పాలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్య సాయి నిత్యనారాయణ సేవ కార్యక్రమానికి పట్టణానికి చెందిన శిల్లా మనోహర్, కుటుంబ సభ్యులు శిల్లా శ్రీనివాసరావు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. శుక్రవారం విరాళానికి సంబంధించిన చెక్కును సత్యసాయి మందిర కన్వీనర్ యు.ప్రభాకరరావుకు అందజేశారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు రమేష్ సాహు, కనకం వెంకటరావు, కిల్లారి రవి ఉన్నారు.

స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయండి

కొమరాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చినమార్కొండపుట్టి, దిగువ గుణద, రాయిపురం గ్రామాల్లో రేషన్ స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయాలని జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డికి మండల టీడీపీ అధ్యక్షుడు శేఖర్‌పాత్రుడు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. రేషన్ దుకాణాల్లో నిత్యావసర వస్తువులు తీసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు జేసీ సానుకూలంగా స్పందించారు.

రేషన్ దుకాణాల తనిఖీ

పాలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం పట్టణంలోని నాగవంశపువీధి, సెగిడివీధి ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ స్మార్ట్ కార్డుల పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం పెద్దకాపువీధి జడ్పీ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ పరిశీలించారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

హెల్త్ వలంటీర్లను నియమించాలి



మాట్లాడుతున్న ఏజేఏసీ అధ్యక్షుడు రామ్మోహనరావు

సీతంపేట రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని ఆదివాసీ ఏజేఏసీ ఆరోగ్య కార్యకర్తల అధ్యక్షుడు బి.రామ్మోహనరావు డిమాండ్ చేశారు. సీతంపేటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హెల్త్ వలంటీర్లు, ఏఎన్ఎంల నియమాకాలు చేపట్టాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు రక్షిత నీరు అందించాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.